క్లుప్తంగా

నేడు సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల సీపీఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి దుర్గం రవీందర్ తెలిపారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణలు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి పార్టీ శాఖల కార్యదర్శులు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న ప్రణయ్

ఆసిఫాబాద్: కౌలు రైతులకు 50శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేయాలని బీసీ యువజన సంఘం నాయకుడు అవుడపు ప్రణయ్ కోరారు. జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గతేడాది అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గడంతో పాటు పత్తికి ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు అంటగడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట యువ నాయకులు గడ్డల ప్రణయ్, సైదం నాగరాజు, గడ్డల కిరణ్, రాజేశ్, విజయ్, తరుణ్ ఉన్నారు.

ఓవైసీ సభకు తరలిన ఎంఐఎం నాయకులు


తరలివెళ్తున్న మజ్లిస్ నాయకులు

ఆసిఫాబాద్: మజ్లిస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని మల్టీపర్పస్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభకు ఆదివారం జిల్లాకు చెందిన పార్టీ నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సల్మాన్ ఖాన్, కార్యదర్శి షకీల్, కోశాధికారి మహ్మద్, నాయకులు అజీమొద్దీన్, అలీ, అఫ్రోజ్, ముజాహిద్, ఐమస్, తమీమ్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై జగదీశ్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విలేజ్ నంబర్.7 గ్రామానికి చెందిన జయ్‌దేవ్ చంద్ర దాస్ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడంతో ఆదివారం ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జగదీశ్ వెంటనే స్పందించి సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి పోగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించి సదరు వ్యక్తికి అప్పగించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శంకర్, సయ్యద్ నయీం పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో అన్నదానం


భోజనం వడ్డిస్తున్న దేవార వినోద్

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి సన్నిధిలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పవన్ జాన్సువార్, జితేందర్, శ్రావణ్, రాకేష్ పాల్గొన్నారు.

నేడు 'చలో ఇందిరాపార్క్'

కౌటాల: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం చేపట్టిన చలో ఇందిరాపార్క్ కార్యక్రమాన్ని జిల్లాలోని వీవోఏలు విజయవంతం చేయాలని వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు ఆదివారం తెలిపారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని గత 42 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

కాడి దూరం.. అద్దె భారం

- వ్యవసాయంలో పెరిగిన ట్రాక్టర్ల వినియోగం
- గంటకు రూ.600 నుంచి రూ.1100 ఖర్చు
- అన్నదాతకు తప్పని తిప్పలు


ట్రాక్టర్‌తో పొలం దున్నిస్తున్న రైతు

కెరమెరి: రైతులకు కాడెద్దులు క్రమంగా దూరమవుతున్నాయి. పశువులను పోషించలేక రైతులు విక్రయిస్తుండడంతో వ్యవసాయానికి నిన్నమొన్నటి వరకు వెన్నుదన్నుగా నిలిచిన జీవాల ఉనికి నేడు ప్రశ్నార్థకమవుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభమయ్యాయి. అనేక మంది వద్ద కాడెద్దులు లేకపోవడంతో ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాటి వినియోగం పెరిగింది. ఇదే అదునుగా ట్రాక్టర్ యజమానులు గంట అరకకు రూ. 600 నుంచి రూ. 800, నాగలికి రూ.1000 నుంచి రూ.1100 వరకు డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేక ట్రాక్టర్ల వినియోగం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఏటా సాగు వ్యయం పెరగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల ధరలకు తోడు వ్యవసాయ కూలీల రేట్లు కూడా గణనీయంగా పెరిగాయని ఆవేదన చెందుతున్నారు. మండలంలో 6422 రైతులు ఉండగా 29,176 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు.

పెరిగిన ట్రాక్టర్ల వాడకం

వ్యవసాయ యాంత్రీకరణ నేడు తారాస్థాయికి చేరింది. ముఖ్యంగా వ్యవసాయంతో పాటు అన్ని పనులకు ట్రాక్టర్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. ఒకప్పుడు ఏదో ఒక ఊరిలో ట్రాక్టర్ ఉండేది. కానీ ప్రస్తుతం ఒక్కో గ్రామంలో పదేసి ట్రాక్టర్ల వరకు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. రాయితీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాడెద్దుల ప్రాధాన్యం పూర్తిగా తగ్గుతూ వస్తోంది. అప్పట్లో ప్రతీ గ్రామంలో 90శాతం రైతు కుటుంబాల్లో కాడెద్దులు భాగంగా ఉండేవి. ప్రస్తుతం 10శాతం కుటుంబాల్లో కూడా కనిపించడం లేదు.

బీడు భూములుగా..

వ్యవసాయం ఖర్చు నానాటికీ పెరగడంతో అనేక మంది రైతులకు చెందిన భూములు బీడుగా మారుతున్నాయి. ఖర్చు చేసేందుకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల నుంచి అనుకున్న స్థాయిలో రుణాలు అందడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు వ్యాపారులు, వడ్డీదారుల వద్ద 'దేహీ' అనాల్సిన పరిస్థితి నెలకొంది.

ఖర్చు పెరుగుతోంది



గతంతో పోలిస్తే వ్యవసాయంపై ఖర్చులు చాలా పెరిగాయి. గతంలో కాడెద్దులతో అరకలు పట్టేవాళ్లం. ఒక్కో అరకకు రూ. 300 ఇచ్చేవాళ్లం. కాని పశుసంపద తగ్గడం వల్ల ట్రాక్టర్ల వాడకం పెరిగింది. ప్రస్తుతం ట్రాక్టర్ ద్వారా అరక దున్నితే రూ.700, నాగలి దున్నితే రూ.1100 చెల్లిస్తున్నాం. – షేక్ రజాక్, రైతు, కెరమెరి

మరమ్మతులకు మోక్షం కలిగేనా?

- పలు చోట్ల కోతకు గురైన రోడ్లు
- ఏళ్లుగా తిప్పలు పడుతున్న ప్రజలు
- వేసవిలో పనులు పూర్తి చేయాలని డిమాండ్


ఐదేళ్ల క్రితం కోతకు గురైన సిర్పూర్(టి) -మాలిని రోడ్డు


గతంలో కోతకు గురైన ఇటిక్యాల పహాడ్ ప్రధాన రహదారి

సిర్పూర్(టి): గతంలో భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు కోతకు గురైన మరమ్మతులకు మోక్షం కలగడం లేదు. గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు కోతకు గురై ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో అధికారుల పనితీరుపై మండల వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏడాది భారీ వర్షాలకు మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు కోతకు గురికావడం, కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. వర్షాకాలంలో భారీ వర్షాలకు మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకోవాలంటే నానా తంటాలు పడుతున్నామని, ఈ వేసవిలోనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కోతకు గురైన రోడ్లతో ఇబ్బందులు..

మండలంలోని ఇటిక్యాల పహాడ్, మాలిని వెళ్లే ప్రధాన రహదారుల్లోని బీటీరోడ్డు భారీ వర్షాలకు ఐదేళ్ల క్రితం పూర్తిగా కోతకు గురైంది. అప్పటి నుంచి ఆయా గ్రామాలకు నిత్యం ప్రయాణాలు సాగించే వాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) -ఇటిక్యాలపహాడ్ వెళ్లే ప్రధాన రహదారి రెండు చోట్ల కోతకు గురైంది. సిర్పూర్(టి) -మాలిని ప్రధాన రహదారి మేడిపల్లి గ్రామ సమీపంలో భారీ వర్షాలకు కోతకు గురై పూర్తిగా రోడ్డు ఒక పక్క కొట్టుకుపోయింది.

నిధులు మంజూరైనా..

సిర్పూర్(టి) -మాలిని ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా నూతన రోడ్డు నిర్మాణానికి రూ. 18 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరు కావడంతో సిర్పూర్(టి) నుంచి నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో మైదాన ప్రాంతాల్లో మాత్రమే ప్రధాన రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. మిగతా పనులు మధ్యలోనే నిలిపివేశారు. మేడిపల్లి గ్రామ సమీపంలో భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్డు ప్రాంతంతో పాటు చీలపెల్లి, రావన్‌పెల్లి గ్రామాల సమీపంలో అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో రోడ్డు పనులు ప్రారంభించడం లేదు.

మరమ్మతులు చేపట్టాలి



భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురికావడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో తిప్పలు మరింత పెరుగుతున్నాయి. వేసవిలోనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి. నూతనంగా మంజూరైన రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు వచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.
– సుర్పం అర్జు, మాజీ సర్పంచ్, చీలపెల్లి

అధికారులు స్పందించాలి



మండలంలోని సిర్పూర్(టి) నుంచి ఇటిక్యాలపహాడ్, మాలిని వెళ్లే ప్రధాన రహదారులు భారీ వర్షాలకు గతంలోనే కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు అధికారులు నిధులు మంజూరు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.
– గెడెం నాగేశ్, చీలపెల్లి

ఎన్టీఆర్ విగ్రహానికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత నందమూరి తారకరామారావు శతజయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్‌లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుల్లెపల్లి ఆనంద్, లావణ్య, సురేశ్, శంకర్, సంజీవ్, శ్రీనివాస్, సత్యనారాయణ, సమ్మగౌడ్, సుధారాణి, మక్బూల్, తదితరులు పాల్గొన్నారు.

ఎండ వేళ.. జలకాలాట..!



కెరమెరి: ఎండ తీవ్రత నుంచి తట్టుకునేందుకు పిల్లలు వాగుల్లో జలకాలాడుతున్నారు. వేసవి సెలవుల్లో ఉన్న విద్యార్థులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మండలంలోని సాంగ్వి గ్రామసమీపంలో ఉన్న పెద్దవాగులో ఆదివారం ఈత కొడుతూ కన్పించారు. ఉదయం 9 గంటలు కాగానే విద్యార్థులంతా గుంపుగా చేరి వాగులో ఆటలాడుతూ ఆహ్లాదంగా గడుపుతున్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

నస్పూర్: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన పట్టణంలోని 15 వ వార్డు సంగం మల్లయ్య పల్లెలో ఇంటింటికీ తిరుగుతూ అర్హులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో అని అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 10 వార్డులోని వినూత్న కాలనీ, శ్రీపాద కాలనీలో సీఎస్ఆర్ నిధులు రూ.8.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.

మజ్జిగ పంపిణీ

మందమర్రిరూరల్: మందమర్రి మార్కెట్ ఏరియాలో జెడ్పీ హైస్కూల్‌లో 1990–91 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని సీఐ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. మండుటెండలో మజ్జిగ పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులను సీఐ అభినందించారు. జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్) పూర్వ విద్యార్థులు ఉన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

తాండూర్: మండలంలోని గోపాల్‌రావు నుంచి కాసిపేట గ్రామానికి వెళ్లేదారిలో కల్వర్టు నిర్మాణ పనులను ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో సమస్యలు పరిష్కారమై అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని సూచించారు. సర్పంచ్ అస్స రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత పోతెపల్లి


బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎస్పీ కరుణాకర్, సీఐ నాగరాజు

దహెగాం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కాగజ్‌నగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రీడాకారులకు మండల కేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విజేతగా పెంచికల్‌పేట్ మండలం పోతెపల్లి జట్టు నిలిచింది. ఫైనల్‌లో పోతెపల్లి, మొట్లగూడ జట్లు తలపడ్డాయి. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ విజేతకు రూ.10 వేల నగదుతో పాటు షీల్డ్ ప్రదానం చేశారు. రెండో బహుమతి మొట్లగూడ జట్టుకు రూ. 5వేల నగదు అందించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ స్ట్రైకర్, బెస్ట్ బూస్టర్, ఆల్‌రౌండర్లకు మెడల్స్ అందించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సనత్‌కుమార్, పీఈటీలు చక్రపాణి, సారంగపాణి, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: గ్రామీణ యువత అన్ని రంగాల్లో రాణించాలని రైతు బంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ నికాడే గంగారం అన్నారు. ఆదివారం మండలంలోని యాపలగూడ గ్రామంలో యూత్ మీటింగ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువకులు చెడు వ్యాసనాల బారిన పడకుండా జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. యువత క్రీడలు, చదువు, రాజకీయంలో ముందుండాలని తెలిపారు. ప్రభుత్వం జూన్ 2 నుంచి నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెర్పల్లి సదాశివ్, నాయకులు నిరంజన్, వెంకటేశ్, పాపయ్య, రావుజీ, గణపతి, లహాన్సు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన బెండారి నాందేవ్, బెండారి వాగు కుటుంబాలకు శనివారం రాత్రి మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యామ్‌రావు మాట్లాడుతూ ఇటీవల ముత్తంపేట్‌లో భారీ అగ్ని ప్రమాదంలో అన్నదమ్ముల ఇళ్లు పూర్తిగా కాలిపోవడం చాలా బాధకరమన్నారు. దాతలు బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదే శ్రీనివాస్, మాలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆదే నాందేవ్, నాయకులు శంకర్, గణేష్, నారాయణ, భీంరావ్, మల్లు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన


పోచమ్మ విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న ఎంపీపీ నానయ్య

చింతలమానెపల్లి: మండలంలోని అంబగట్ట గ్రామంలో నూతనంగా పోచమ్మ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రతిష్ఠించారు. గ్రామంలోని భక్తులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోమాసి విలాస్, ఉప సర్పంచ్ బి. కమల, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం

దహెగాం: మండల కేంద్రంలో నేటి నుంచి శ్రీశ్రీశ్రీ పోచమాంబ శీతలాదేవి, నవగ్రహ సంతాన నాగేంద్రస్వామి విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. 29న ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 31న పోచమాంబ శీతలాదేవి (బొడ్డురాయి) విగ్రహాల ప్రతిష్టాపన ఉంటుందన్నారు. గురువారం పోచమ్మ కొలుపు, బోనాల పండుగ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఐదుగురు పేకాటరాయుళ్లపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.12 గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.7 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడుతున్నట్లయితే తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పేకాట ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాగర్జన బహిరంగసభ విజయవంతం చేయండి


తాండూర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్

బెల్లంపల్లిరూరల్/తాండూర్: సీపీఐ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెంలో జూన్ 4న నిర్వహించే పార్టీ ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ కోరారు. బెల్లంపల్లి మండలం రంగపేట, తాండూర్ మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకున్నామని అన్నారు. సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, నాయకుడు కె.నారాయణ, రాష్ట్ర రథసారధి సాంబశివరావు, ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ప్రజలు, కార్మికులు, మేధావులు, కర్షకులు పాల్గొనాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మామిడాల రాజేశం, మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి భయ్య మొగిళి, మండల సహాయ కార్యదర్శి గోమాస గంగారాం, నాయకులు సహదేవరావు, దుగుట తిరుపతి, జూపాక సరోజ, తిరుమల్, ప్రసాద్, మానస, ఆనంద్, నర్సమ్మ, లక్ష్మి, మహేశ్, ఆనంద్, ప్రహలాద్, సన్యాసి, బాపు, భీమేష్, రాజు, భీమన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే పైప్‌లైన్ మార్పు

దండేపల్లి: గూడెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ మార్పు కమీషన్ల కోసమే తప్పా, రైతులకు మేలు చేసేందుకు కాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆరోపించాడు. మండలంలోని ముత్యంపేట ఏఎల్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పైప్‌లైన్ పునర్నిర్మాణంలో కొత్త పైపులు వాడకుండా, పాత పైపులు వేయడంపై మండిపడ్డారు. ఇప్పటికే నాణ్యత లోపించడంతో లెక్కలేనన్ని సార్లు లీకయ్యాయని, రైతులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ప్రస్తుతం నాలుగు కి.మీ మేర జీఆర్‌పీ పైప్‌లైన్ తొలగించి, దాని స్థానంలో ఎక్కడో తొలగించిన ఎమ్మెఎస్ పైపులు ఇక్కడకు తెచ్చివేస్తే, అవి ఎన్ని రోజులు ఆగుతాయని ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో రైతులను మభ్యపెట్టేందుకే పైప్‌లైన్ పునర్నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు.